క్లుప్తంగా

ఇష్టంతో చదివితే ఉత్తమ ఫలితాలు

ఎంఈఓ బుచ్చనాయక్



సన్మానించిన ఎంఈఓ, సంస్థ ప్రతినిధులు

శివంపేట(నర్సాపూర్): విద్యార్థులు ఇష్టంతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎంఈఓ బుచ్చనాయక్ అన్నారు. సోమవారం మండలంలోని పెద్దగొట్టిముక్కల ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సత్కరించారు. అనంతరం విద్యార్థులు శ్రీవల్లి, పరమేశ్వరిలను అక్షర సేద్యం ఫౌండేషన్ తరఫున నగదు ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో విశిష్ట అతిథి కృష్ణ, సంస్థ ప్రధాన కార్యదర్శి రాజు, హెచ్ఎం సురేష్, శ్రీనివాస్, ఫౌండేషన్ ప్రతినిధులు రవికుమార్, వంశీ, హరిబాబు, రాజు, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు



ఆయిల్‌పాం మొక్కలు నాటుతున్న రైతులు

చిన్నశంకరంపేట(మెదక్): ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు ఉంటాయని హార్టికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్ సుజాత అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని ఖాజాపూర్ గ్రామశివారులో సోమవారం గ్రామానికి చెందిన తీగుల్ల పెద్ద సత్తమ్మ మూడు ఎకరాల పొలంలో ఆయిల్‌పాం సాగు మొక్కలను నాటించారు. అనంతరం ఆమె మాట్లాడుతు ప్రభుత్వం సబ్సిడీతో ఆయిల్‌పాం మొక్కలు నాటినట్లు తెలిపారు. రైతులు ఆయిల్‌పాం సాగుకు ముందుకు రావాలని సూచించారు.

నాచారం డైరెక్టర్‌గా సంతోష్



సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం గ్రామానికి చెందిన సంతోష్ పంతులు నాచారం లక్ష్మీనర్సింహాస్వామి దేవస్థానం డైరెక్టర్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నాచారం దేవాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జూపల్లి మల్లారెడ్డి, యూత్ అధ్యక్షుడు నవీన్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. ఆయన వెంట నాయకులు నర్సింహ, చందు తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



నర్సాపూర్‌లో పర్యటిస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజిరెడ్డి, నాయకులు

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన చేపట్టిన నమస్తే నర్సాపూర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఇందులో భాగంగా పలు వార్డుల్లో రోడ్లు, మురుగు కాల్వలు లేకపోవడంతో దోమలు వ్యాపించి ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఆయన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పందుల సంచారంతో దుర్వాసన



8వ వార్డులో చెత్త కుప్ప వద్ద పందులు

నర్సాపూర్: మున్సిపాలిటీలోని తమ వార్డులో పందులు ఇష్టానుసారంగా సంచరిస్తున్నాయని 8వ వార్డు ప్రజలు ఆరోపిస్తున్నారు. వార్డులో పారిశుద్ధ్య సిబ్బంది పనులు చేపట్టడం లేదన్నారు. దీంతో చెత్తాచెదారం, మురుగు పేరుకుపోతుందని ఆరోపించారు. పందులు సంచరించడంతో దుర్వాసన ఎక్కువగా వ్యాప్తి చెందుతుందన్నారు. దోమలు విజృంభించడంతో వ్యాధుల బారిన పడుతున్నామని, చర్యలు తీసుకోవాలని కారులను కోరారు.

ఉపకార వేతనం.. భవితకు ఊతం!

- నాలుగేళ్లపాటు అందనున్న కేంద్ర సాయం
- ఎన్ఎంఎంఎస్ ద్వారా ఏడాదికి రూ.12వేల నగదు
- ఈ నెల 31వరకు దరఖాస్తులకు చివరి గడువు



ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు

తూప్రాన్: ప్రభుత్వ బడుల్లో విద్యను అభ్యసించే పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్రం ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుంది. ఆర్థిక ఇబ్బందులతో మధ్యలోనే చదువులను ఆపేసే విద్యార్థులకు కేంద్రం అందిస్తున్న ఉపకార వేతనాలు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ప్రతిభ ఆధారంగా జాతీయ ఉపకార వేతనాన్ని అందజేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం 2008లో జాతీయ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్(ఎన్ఎంఎంఎస్) అమల్లోకి తీసుకొచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ అర్హులుగా గుర్తించగా.. ప్రతిభ ఆధారంగా వీరికి 9వ తరగతి నుంచి నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేలు ఇవ్వనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే ప్రతిభ ఆధారంగా ఎంపికైనా విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ కోర్సుల్లో విద్యను అభ్యసించేందుకు నాలుగేళ్ల పాటు స్కాలర్ షిప్ అందజేయనున్నారు. అయితే విద్యార్థులు ఆయా కళాశాలల్లో ఉపకార వేతనం కోసం వివరాలను ఆప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నగదు నేరుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ కానుంది. ఇందులో భాగంగానే ఈ ఏడాది నవంబర్‌లో జరగనున్న ఈ పరీక్షకు ఇప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తున్నారు. ఈ నెల 31 వరకు ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు మండలంలోని హైస్కూల్ ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. ఇందు కోసం జనరల్, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు రూ.50 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉండగా.. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఉపాధ్యాయులే ఫీజు చెల్లించి పోటీ పరీక్షకు సన్నద్ధం చేస్తున్నారు. ఆర్థిక స్థోమత లేని విద్యార్థుల చదువులు మధ్యలో ఆపేయకుండా జాతీయ ఉపకార వేత నాలు ఉపయోగపడుతున్నాయని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

పరీక్షకు అర్హతలు ఇవే...

జాతీయ ఉపకార వేతనాలు పొందేందుకు నిర్వహించే ప్రతిభా పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు మండల పరిషత్, జిల్లా పరిషత్ విద్యను అభ్యసించే విద్యార్థులు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు. 7వ తరగతిలో కనీసం 55 శాతం మార్కులు సాధించాల్సి ఉండగా.. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 5 శాతం మార్కులు సడలింపు ఉంటుంది. అలాగే విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలకు మించి ఉండకూడదు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఫాం జిరాక్స్ కాపీతో పాటు 7వ తరగతిలో ఉత్తీర్ణత పొందిన మార్కుల జాబితా, ఆదాయ, కుల ధృవీకరణ జిరాక్స్ పత్రాలను ఈనెల 31న జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందించాల్సి ఉంటుంది.

విద్యార్థులకు ఉపయోగకరం..



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కేంద్రం ప్రభుత్వం నాలుగేళ్ల పాటు అందించనున్న ఉపకారవేతనాలతో మేలు జరుగనుంది. ప్రతిభ చాటిన విద్యార్థులకు ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్లకు రూ.48 వేలు అందనున్నాయి. కావున విద్యార్థులు ఇప్పటి నుంచే పరీక్ష రాసేందుకు సన్నద్ధమవ్వాలి. దీంతో తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గనుంది. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

– రాధాకిషన్, డీఈఓ, మెదక్

మార్కండేయ శివాలయానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలో చేనేత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న మార్కండేయ మహర్షి మహేశ్వరాలయం శంకుస్థాపన పూజ కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది. ఆలయ నిర్మాణంలో భాగంగా గణపతిపూజ, నవగ్రహపూజ, వాస్తు, తదితర పూజా కార్యక్రమాలను పురోహితుడు ఉమాశంకర శర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, మాజీ ఎంపీపీ పద్మనర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్‌లు వెంకటేశ్వర్‌రెడ్డి, పెద్ద చిన్నంరెడ్డి, సొసైటీ డైరెక్టర్ చిన్న చిన్నంరెడ్డి, నర్సింలు, సభ్యులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ విష్ణురాజు, ఇతర ప్రతినిధులు

నర్సాపూర్: విద్యార్థులు ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వంటి సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని శ్రీవిష్ణు ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ విష్ణురాజు సూచించారు. సోమవారం స్థానిక బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన మొదటి సంవత్సరం విద్యార్థుల ఇండక్షన్ ప్రోగ్రాంకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సోషల్ మీడియాలో వాస్తవ పోస్టులను గుర్తించి ఇతరులకు పంపాలని విద్యార్థులకు హితవు పలికారు. ఇంజనీరింగ్‌లో కోడింగ్, వృత్తి నైపుణ్యత, కమ్యూనికేషన్ స్కిల్స్, భావ వ్యక్తీకరణకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.హ్యాకథాన్, గోకర్ట్ వంటి పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు పొందాలన్నారు. అనంతరం మొదటి సెమిస్టర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మెమోంటోలతో సన్మానించారు. ఈ మేరకు కాలేజీకి చెందిన సావనీర్‌ను చైర్మన్ విష్ణురాజుతో పాటు ఇతర ప్రతినిధులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్‌రాజగోపాల్, కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, కాలేజీ ప్రతినిధులు సతీష్‌చంద్ర, రవికిరణ రాజు, డీజీఎం కాంతారావు, మేనేజర్ బాపిరాజు, ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమా దరఖాస్తుల స్వీకరణ



చేగుంటలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో సోమవారం రైతు బీమా దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ , ఏఈఓ మాధవి రైతులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

టేక్మాల్(మెదక్): రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్ సోమవారం తెలిపారు. అర్హత కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చిన్నశంకరంపేట(మెదక్): రైతు బీమా కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు నార్సింగి ఏఈఓలు విజృంభణ, దివ్య తెలిపారు. సోమవారం నార్సింగి రైతువేదికలో దరఖాస్తులను స్వీకరించారు.

పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట(మెదక్): రైతుల నుంచి రైతు బీమా దరఖాస్తులను సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఏఓ కృష్ణ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు వినీత్, అఖిల్, మమత తదితరులున్నారు.

రేపటిలోగా దరఖాస్తు చేసుకోవాలి..

రామాయంపేట(మెదక్): కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకులు రాజ్‌నారాయణ సూచించారు.

రేపటితో గడువు ముగింపు

నర్సాపూర్: రైతు బీమాకు ఈనెల 13న గడువు ముగుస్తుందని వ్యవసాయ శాఖ స్థానిక ఏడీ సంధ్యారాణి చెప్పారు. ఈ మేరకు సోమవారం ఏఈఓ దీపికతో కలిసి రైతులకు అవగాహన కల్పించారు.

నేడు టీఎల్ఎం మేళా

వెల్దుర్తి(తూప్రాన్): విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను మెరుగు పరిచేందుకు టీఎల్ఎం మేళా ఎంతగానో దోహదపడుతుందని ఎంఈఓ సీతారాం అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మండల స్థాయిలో ఎఫ్ఎల్ఎం టీఎల్ఎం మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు సకాలంలో హాజరు కావాలన్నారు.

బోధనోపకరణ మేళాను జయప్రదం చేయాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రంలోని చిలప్‌చెడ్ ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 13న నిర్వహించనున్న మండల స్థాయి బోధనోపకరణ మేళాను జయప్రదం చేయాలని ఎంఈఓ విఠల్ అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాల నుంచి గరిష్టంగా నాలుగు, కనిష్టంగా రెండు ప్రదర్శనలు ఉండాలన్నారు. ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ప్రదర్శనలు ఉండాలన్నారు. మండల స్థాయిలో ఉత్తమంగా ఉన్న పది ప్రదర్శనలను జిల్లా స్థాయి మేళాకు ఎంపిక చేయనున్నారు.

వాగును కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోండి

ఇరిగేషన్ శాఖ అధికారులకు రైతుల ఫిర్యాదు

నర్సాపూర్ రూరల్: పెద్ద చెరువుకు వరద నీరు వచ్చే వాగును కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాగజ్ మద్దూర్ గ్రామ రైతులు సోమవారం ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సర్వే నంబర్ 63లో గల పెద్దచెరువుకు వరద నీరు వచ్చే వాగును హైదరాబాద్‌కు చెందిన కల్లేపల్లి రమణారావుకబ్జా చేసి జామ తోట సాగు చేస్తున్నట్లు కాగజ్ మద్దూరు రైతులు తెలిపారు. ఈ వాగును కబ్జా చేయడంతో చుట్టుపక్కల రైతుల పంట పొలాల్లోకి వరద నీరు చేరి పంటలు మునిగి నష్టపోతున్నామని వాపోయారు. వాగును దారి మళ్లించినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ మణిభూషణ్ వివరణ కోరగా.. వాగును పరిశీలించి కబ్జా చేసినట్లు తెలితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకొని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

పాఠశాలలో మరుగుదొడ్లు, నల్లాల ధ్వంసం

- విద్యార్థులకు తప్పని తిప్పలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన హెచ్ఎం



ధ్వంసమైన నల్లాలు, మరుగుదొడ్లను చూపుతున్న హెచ్ఎం

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని రంగాయపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు, నల్లాలు, టాయిలెట్స్‌లను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వెంటనే ఈ ఘటనపై పోలీసులు హెచ్ఎం సంజీవరావు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గతంలోనే కొంత మంది దుండగులు పాఠశాల్లోకి వచ్చి ధ్వంసం చేశారని చెప్పారు. ఇలాంటి సంఘటనలు పునారావృత్తం కాకుండా గ్రామస్తుల సహాయంతో ప్రత్యేక దృష్టి సారిస్తామని పోలీసులు తెలిపారు.

ప్రజావాణికి అర్జీల వెల్లువ



చిన్నశంకరంపేటలో ప్రజావాణిలో అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మాలతి రైతులకు సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రైతుల నుంచి భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించారు. అలాగే శాలిపేట గ్రామానికి చెందిన నర్రబాబు తాను అందించిన ప్రజాపాలన దరఖాస్తును ఆప్‌లోడ్ చేయకపోవడంతో అభయహస్తం పథకాలు అందడంలేదని వినతి పత్రం అందించారు. అలాగే నార్సింగి తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి పలువురు రైతులు వినతి పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆనంద్, ఎస్ఐ సృజన, హౌసింగ్ ఏఈ రియాజ్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

నిర్మించారు.. వదిలేశారు!

- వాహనదారులకు తప్పని ఇక్కట్లు

మనోహరాబాద్(తూప్రాన్): వాహనదారుల రాకపోకలకు లక్షలు వెచ్చించి పాలాట-పోతారం వద్ద రైల్వే అండర్ పాస్ నిర్మించారు. అయితే సీసీ రోడ్డును అస్తవ్యస్తంగా లెవల్ చేయకుండా వదిలేశారు. దీంతో అండర్ పాస్‌లో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మధ్యలో ఒక వైపు తక్కువ.. మరోవైపు ఎత్తుగా ఉండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు సరిగ్గా లేకపోవడంతో వాహనాలు దెబ్బతింటున్నాయని వాపోతున్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



అస్తవ్యస్తంగా వదిలేసిన రోడ్డు



పిచ్చిమొక్కలతో నిరుపయోగంగా మారిన బస్టాండ్

ఉన్నా.. లేనట్లే!

- నిరుపయోగంగా బస్టాండ్
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామ స్టేజీ వద్ద ఉన్న బస్టాండ్‌ను కొంతకాలంగా పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. గతంలో ఆయా గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు బస్టాండ్ ఎండతో పాటు వర్షానికి రక్షణగా ఉండేది. కానీ ఆ తర్వాత బస్టాండ్‌ను పరిశుభ్రంగా ఉంచకపోవడంతో బస్టాండ్ ఆవరణలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు రోడ్లపైనే నిల్చుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌ను వాడుకలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పిల్లల ఆరోగ్యం అందరి బాధ్యత

డిప్యూటీ డీఎంహెచ్ఓ సృజన



చిన్నశంకరంపేట: అల్బెండజోల్ మాత్రలను అందిస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయిసింధు



చిట్కుల్ కేజీబీవీలో అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న సిబ్బంది

కౌడిపల్లి(నర్సాపూర్): పిల్లల ఆరోగ్యం మన బాధ్యత అని, పిల్లలకు తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ సృజన తెలిపారు. సోమవారం జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ఎంపీడీఓ శ్రీనివాస్, మండల వైద్యాధికారి శ్రీకాంత్, డాక్టర్ ఫెర్నాజ్, సీహెచ్ఓ ఎలిజబెత్‌రాణి, ఏఎన్ఎం శ్రీధర్‌రెడ్డి, ఆశవర్కర్ చెన్నమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేగుంటలో..

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నీరజ, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు రఘుపతి పాల్గొన్నారు.

శివంపేట ఉన్నత పాఠశాలలో..

శివంపేట(నర్సాపూర్): జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా శివంపేట ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మాత్రలు వేశారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీఓ, వైద్యాధికారి, ఆసుపత్రి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నిజాంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, కార్యదర్శులు, ఉపాధ్యాయులు, తదతరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను వైద్యసిబ్బంది, అధికారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశం, ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ షాకీర్‌అలీ, వైద్యాధికారి షరీఫుద్దిన్, వైద్య సిబ్బంది సాయిలు, యాదయ్య, వెంకటేశం, వెంకటరమణాబాయి తదితరులున్నారు.

కస్తూర్బా పాఠశాలలో..

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల, అంగన్ వాడీ కేంద్రంలోని విద్యార్థులకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయిసింధు అల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా ప్రిన్సిపాల్ గీతా, అంగన్‌వాడీ టీచర్ నాగరణి తదితరులు పాల్గొన్నారు. అలాగే నార్సింగి మండల కేంద్రంలోని జెడ్పీపాఠశాలలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రేఖ, తహసీల్దార్ గ్రేసిబాయి, ఎంపీడీఓ ఆనంద్‌కుమార్ విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను అందించారు.

చిట్కుల్ గ్రామ శివారులో

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిటుకుల్ గ్రామ శివారులో ఉన్న కేజీబీవీలో సోమవారం విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులు వేసినట్లు మండల ప్రత్యేకాధికారి అంజలి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏఎన్ఎం, ఆశావర్కర్ల సహాయంతో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశామన్నారు.

రంగంపేట పీహెచ్‌సీ పరిధిలో..

కొల్చారం(నర్సాపూర్): మండల వ్యాప్తంగా సోమవారం కొల్చారం, రంగంపేట పీహెచ్‌సీ పరిధిలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్, కేజీబీవీ, అంగన్ వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణ, డీపీఎంఓ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ అలుగు పారుతున్న చెరువులు



నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నందిగామ గ్రామంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు అలుగు పారుతున్నాయి. ఈ మేరకు సోమవారం గ్రామంలోని సాయి చెరువు నిండుకుండలా మారింది. రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

◆ రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నందిగామ గ్రామ శివారులో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలైనట్లు తెలుస్తోంది. వివరాల ప్రకారం.. రామాయంపేట మండలంలోని చిన్న తండాకు చెందిన గంగారాం తన బైక్‌పై నిజాంపేట నుంచి ఇంటికి వెళ్తున్నాడు. ఈ సమయంలో నందిగామ గ్రామశివారులని ఓ రైస్‌మిల్లు పనిచేస్తున్న బీహార్ కూలీలు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా.. గంగారాం వెనకనుంచి వారిని ఢీకొట్టాడు. దీంతో బైక్ నుంచి గంగారాం కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో ఆయనతోపాటు అనిల్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే బాధితులను 108 సిబ్బంది రామాయంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

◆ పాఠశాలలో రాఖీ సంబరాలు

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలోని మనోహరాబాద్ ఉన్నత పాఠశాలలో రాఖీ బంధన్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తోటి విద్యార్థులకు రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

◆ నూతన కమిటీ ఎన్నిక

తూప్రాన్: తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల శాఖ అధ్యక్షుడిగా మల్లారెడ్డి ఎన్నికయ్యారు. సోమవారం పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో మల్లారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయనతోపాటు సంఘం ప్రధాన కార్యదర్శిగా విద్యాసాగర్, ఫైనాన్స్ సెక్రటరీగా నాగభూషణం, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా శంకరంపేట రాములుగౌడ్, వైస్ ప్రెసిడెంట్‌గా భిక్షపతిగౌడ్, ఉమెన్ వింగ్ వైస్ ప్రెసిడెంట్‌గా మాజీ జెడ్పీటీసీ నాయిని అండాలమ్మ, సంయుక్త కార్యదర్శిగా మధుసూదన్‌రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఉమారాణి, ప్రచార కార్యదర్శిగా మల్లయ్యలను ఎన్నుకున్నారు. అనంతరం వారిని శాలువాలతో సన్మానించారు.

◆ ఆలయాల్లో భక్తుల సందడి

పెద్దశంకరంపేట(మెదక్): శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. సోమవారం మండల పరిధిలోని కొప్పోల్ ఉమాసంగమేశ్వర దేవాలయం, గురుపాదగుట్ట శివాలయం, గొట్టిముక్కుల శివాలయంతో పాటు స్థానిక జ్యోతిర్లింగ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీతో పలువురు భక్తులు అన్నదానం నిర్వహించారు.

శిథిలావస్థకు చేరిన పంచాయతీ భవనం



హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని చిట్యాల పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరింది. గత కొంతకాలం కురుస్తున్న వర్షాలకులో స్లాబ్ లీకేజీ కావడంతో పాటు భవనంలోకి నీరు చేరుతుంది. అంతేకాకుండా స్లాబ్ పెచ్చులూడి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో పంచాయతీకి వచ్చే ప్రజలతో పాటు కార్యదర్శి బిక్కుబిక్కుమంటూ భయాందోళనతో విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.